సాక్షి నిజామాబాద్

గురువారం । 28 । సెప్టెంబర్ । 2023



రుణమాఫీకి ప్రత్యేక గుర్తింపు

రుణమాఫీ పథకం దేశంలోనే ప్రత్యేక రైతు పథకంగా గుర్తింపు పొందిందని ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ అన్నారు.

- 8లో ▸



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
34.8 /22.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. రాత్రి మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

క్వార్టర్ ఫైనల్స్‌కు నిఖత్‌జరీన్




నిజామాబాద్‌నాగారం: చైనాలో కొనసాగుతున్న ఏషియన్ గేమ్స్‌లో బాక్సర్ నిఖత్‌జరీన్ వరుస విజయాలతో దూసుకెళ్తున్నది. బుధవారం సౌత్‌కొరియా క్రీడాకారిణిని 5–0 తేడాతో ఓడించిన జరీన్.. క్వార్టర్ ఫైనల్స్‌కు చేరింది. 29వ తేదీన క్వార్టర్‌ఫైనల్స్‌లో జోడేన్ దేశానికి చెందిన క్రీడాకారిణితో తలపడనుంది.

29న జాబ్‌మేళా

నిజామాబాద్‌నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్‌రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 29న ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సిరిమల శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అపోలో ఫార్మసీలో రిటైల్ ట్రైనీ అసోసియేట్, ఫార్మసీ అసిస్టెంట్, ట్రైనీ ఫార్మసిస్ట్ ఉద్యోగాలున్నాయని, ఇంటర్/డిగ్రీ/డి.ఫార్మసీ/బీ.ఫార్మసీ/ఎం.ఫార్మసీ/బీబీఎం విద్యార్హత గల వారు హాజరుకావొచ్చని పేర్కొన్నారు. 18 నుండి 30 ఏళ్లలోపు వారు జిల్లా ఉపాధి కార్యాలయానికి శుక్రవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రావొచ్చిన సూచించారు. బయోడేటా, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకు రావాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 95817 68413, 63057 43423, 99594 56793 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఎస్సారెస్పీ నీటి విడుదల

- పోటెత్తిన వరద.. 13 గేట్ల ఎత్తివేత



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాలనుంచి వరద పోటెత్తింది. అధికారులు వరదగేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. బుధవారం ఉదయం 28వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, క్రమంగా 65వేలకు పెరిగింది. 13 వరద గేట్ల ద్వారా దిగువకు 40,612 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కాలువల ద్వారా సైతం నీటి విడుదల కొనసాగుతున్నది. కాకతీయ కాలువ ద్వారా 6 వేల క్యూసెక్కులు, వరద కాలువ ద్వారా 12 వేలు, సరస్వతీ కాలువ ద్వారా 300 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కుల నీరుపోతోంది.


బ్యాంకు ఎదుట రైతుల ధర్నా



రెంజల్(బోధన్): సకాలంలో పంట రుణ మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని దూపల్లి గ్రామ రైతులు స్థానిక బ్యాంకు ఎదుట బుధవారం ధర్నా నిర్వహించారు. ఇప్పటి వరకు 30 మంది రైతులకు మాత్రమే మాఫీ వచ్చిందని, మిగిలిన రైతులకు జాప్యం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకర్లు రైతులకు సహకరించడం లేదని ఆరోపించారు. మాఫీ వచ్చినట్లు తమ సెల్‌ఫోన్లకు సమాచారం రాగా, బ్యాంకుకు వెళ్లి ఆరా తీస్తే డబ్బులు జమకాలేదని సమాధానం చెబుతున్నారన్నారు. తమను అయోమయానికి గురి చేయొద్దని కోరారు. సర్పంచ్ సాయారెడ్డి, మాజీ సర్పంచ్ సుదర్శన్‌యాదవ్, రైతులు లింగంయాదవ్, దేవీదాస్, సాయిలు, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో కారు చోరీ..

డిచ్‌పల్లి : డిచ్‌పల్లి మండల కేంద్రంలోని దొంది సత్యనారాయణ తన కారు (ఏపీ25ఎల్9023) చోరీకి గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 25న మధ్యాహ్నం తన ఇంటి ముందు నిలిపించాడు. మరుసటి రోజు ఉదయం లేచి చూసేసరికి కారు కనిపించలేదు. బాల్కొండ మండలం పోచంపాడ్‌లో ఏటీఎం చోరీ ఘటనలో ఈ కారు ఉపయోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఈ విషయమై దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేశ్ తెలిపారు.



నిమజ్జనానికి సర్వం సిద్ధం

- నగరంలో శోభాయాత్రకు భారీ ఏర్పాట్లు
- దుబ్బలో ప్రారంభించనున్న ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, సార్వజనిక్ గణేశ్ మండలి అధ్యక్షుడు బంటు గణేశ్
- శోభాయాత్ర సాగే మార్గంలో గుంతల పూడ్చివేత
- లైటింగ్ సిస్టం ఏర్పాటు చేసిన నగర పాలక సంస్థ
- బందోబస్తు విధుల్లో 15 వందల మంది పోలీసులు
- బాసర, ఉమ్మెడ వద్ద గోదావరిలో పెద్ద విగ్రహాల నిమజ్జనం



వినాయక్‌నగర్‌లోని వినాయకుల బావివద్ద నిమజ్జనం ఏర్పాట్లు

నిజామాబాద్ సిటీ/ఖలీల్‌వాడి : నవరాత్రులు పూజలందుకున్న బొజ్జ గణపయ్య నిమజ్జనానికి తరలనున్నాడు. జిల్లా వ్యాప్తంగా ఐదు వేలకు పైగా విగ్రహాలను నెలకొల్పారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇది వరకే రెండు వేల విగ్రహాలను నిమజ్జనం చేశారు. నగరం, పట్టణ ప్రాంతాల్లో గురువారం విగ్రహాల నిమజ్జనం జరుగనుంది. నిజామాబాద్ నగరపాలక సంస్థ నగరంలో వినాయకుల నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శోభాయాత్ర (విగ్రహాల రథం) సాగే మార్గంలో మైక్ సిస్టమ్స్, లైటింగ్స్ ఏర్పాటు చేశారు. మార్గాన్ని మున్సిపల్, ఆర్‌అండ్‌బీ, పోలీసు అధికారులు, సార్వజనిక్ ప్రతినిధులు పరిశీలించారు. రోడ్డుపై గుంతలను పూడ్చివేయించారు. ఆనవాయితీ ప్రకారం నగరంలోని దుబ్బా నుంచి ప్రారంభమయ్యే శోభాయాత్ర వినాయక్‌నగర్‌లోని నిమజ్జన బావి వరకు వెళ్తుంది. బావి చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. గణనాథుడిని నిమజ్జనం చేసేవారిని మాత్రమే బావివద్దకు అనుమతించేందుకు పోలీసులు, మున్సిపల్ సిబ్బంది తగు చర్యలు తీసుకున్నారు. శోభాయాత్ర మార్గంలో ఎల్‌ఈడీ లైట్లు 750, టవర్లు 10 ఏర్పాటు చేశారు. లైటింగ్‌కు ఎక్కడా అంతరాయం కలుగకుండా 30 మంది విద్యుత్ సిబ్బందికి విధులు అప్పగించారు. మున్సిపల్ కార్పొరేషన్ డీఈఈలు ముగ్గురు, ఏఈఈలు నలుగురు, ఇన్‌చార్జి అధికారులు నలుగురు, పారిశుద్ధ్య సిబ్బంది 940మందిని నియమించారు. మూడు సహాయ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

సంస్కార భారతి ఆధ్వర్యంలో..

నగరంలోని గోల్ హనుమాన్ వద్ద సంస్కార భారతి ఆధ్వర్యంలో గణనాథులకు, గణేశ్ మండళ్ల నిర్వాహకులకు స్వాగత ఏర్పాట్లు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. శోభాయాత్రను మధ్యాహ్నం ఒంటిగంటకు దుబ్బా చౌరస్తాలో ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, సార్వజనిక్ గణేశ్ మండలి అధ్యక్షుడు బంటు గణేశ్ జెండా ఊపి ప్రారంభిస్తారు.

గజ ఈతగాళ్లు

నగంలోని నిమజ్జనం బావి వద్ద, బాసర బ్రిడ్జిపై 10 మంది చొప్పున గజ ఈతగాళ్లను నియమించారు. బాసర వద్ద గోదావరిలో విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు బ్రిడ్జిపై అయిదు క్రేన్లు ఏర్పాటు చేశారు.

భారీ బందోబస్తు


జిల్లాలో గణేశ్‌నిమజ్జన కార్యక్రమానికి 1500 మంది పోలీసులతో బందోబస్తును ఏర్పాటు చేసినట్లు సీపీ సత్యనారాయణ తెలిపారు. నగరంలో ఐదుగురు ఏసీపీలు, 15 మంది సీఐలు, 30 మంది ఎస్సైలు, 400 మంది కానిస్టేబుళ్లు బందోస్తు విధుల్లో పాల్గొంటారు. 40 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయగా, 10 మంది వీడియోగ్రాఫర్‌లతో వీడియో తీయిస్తున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన అదనపు కలెక్టర్



బాసర బ్రిడ్జిపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ యాదిరెడ్డి

నవీపేట: గణేశ్ నిమజ్జన ఏర్పాట్లను జిల్లా అదనపు కలెక్టర్ యాదిరెడ్డి బుధవారం బాసర బ్రిడ్జిపై పరిశీలించారు. విద్యుత్, క్రేన్ సౌకర్యాలను సమీక్షించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవో సయ్యద్ అలీ, తహసీల్దార్ ధన్వాల్, ఎస్సై యాదగిరిగౌడ్ తదితరులు ఉన్నారు.



8 ఫీట్ల లోపు విగ్రహాలు..

ఎడపల్లి మండలం జాన్కంపేట్‌లో బ్రాడ్‌గేజ్ రైలు హై టెన్షన్ రైల్వే లైన్ ఉన్నందున 8 ఫీట్ల లోపు ఎత్తున్న విగ్రహాల వాహనాలను మాత్రమే వెళ్లడానికి ఈ రూట్‌లో అనుమతి ఇచ్చారు. విగ్రహాలు నగరం నుంచి నెహ్రూ పార్కు, అర్సపల్లి, జాన్కంపేట్, నవీపేట్ మీదుగా బాసర గోదావరి నదికి వెళ్తాయి.

8 ఫీట్ల కంటే ఎత్తున్న విగ్రహాలు..

నగరం నుంచి మానిక్‌భండార్, దాస్‌నగర్, మాక్లూర్ నుంచి నందిపేట్, నవీపేట్ మీదుగా బాసర గోదావరి నదికి వెళ్తాయి. కొన్ని విగ్రహాలను నందిపేట్ మండలం ఉమ్మెడలోని గోదావరి నదికి తరలిస్తారు.

ఏటీఎంలో భారీ చోరీ

- రూ.12 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు
- గ్యాస్ కట్టర్‌తో మిషన్ ధ్వంసం
- డాగ్ స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు



ఏటీఎం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు



దొంగలు ధ్వంసం చేసిన ఏటీఎం

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ కూడలి సమీపంలో జాతీయ రహదారి 44 పక్కన ఎస్‌బీఐ బ్యాంకు వద్ద గల ఏటీఎంలో బుధవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దొంగలు ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేసి సుమారు రూ.12 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఏటీఎంలోకి చొరబడి ముందుగా సీసీ కెమెరాలకు బ్లాక్ స్ప్రే కొట్టారు. గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను ధ్వంసం చేశారు. అందులోంచి నగదును ఎత్తుకెళ్లారు. ఏటీఎంలో దొంగలు చొరబడిన వెంటనే తెల్లవారుజామున 3.18 గంటలకు బ్యాంకు మేనేజర్ బాలరాజు సెల్ ఫోన్‌లో అలారం మోగింది.

వెంటనే ఆయన మెండోరా పోలీస్ స్టేషన్‌కు, ఎస్సైకి ఫోను ద్వారా సమాచారం అందించాడు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు ఏటీఎం వద్దకు చేరుకునే లోపే దొంగలు పరారైనట్లు తెలిపారు. పోలీసులు క్లూస్‌టీంను రప్పించి వేలిముద్రలు సేకరించారు. డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. డాగ్ స్క్వాడ్ ఏటీఎం నుంచి నిర్మల్ వైపు గల రోడ్డు వెంబడి వెళ్లి దూదిగాం గ్రామ శివారులో బస్టాండ్ వద్ద నిలిచిపోయింది. అక్కడి నుంచి దొంగలు నిర్మల్ వైపు పరారైనట్లు పోలీసులు భావిస్తున్నారు.

ఆరు బృందాలు ఏర్పాటు..

ఏటీఎంలో చోరీకి పాల్పడిన దొంగల కోసం ఆరు బృందాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా అడిషనల్ డీసీపీ జయరాం తెలిపారు. ధ్వంసమైన ఏటీఎంను ఆర్మూర్ ఏసీపీ జగదీశ్వర్‌తో కలిసి ఆయన పరిశీలించారు. అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఏటీఎంలో చోరీ జరిగిన మాదిరిగానే గతంలో ఎక్కడైనా జరిగిందా కోణంలో పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఆర్మూర్ రూరల్ సీఐ గోవర్ధన్‌రెడ్డి, రిజర్వుడు ఇన్‌స్పెక్టర్ వెంకటప్ప, ఎస్సై శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పోలీసులు సకాలంలో వెళ్తే..

చోరీకి గురైన ఏటీఎం నుంచి పోలీసు స్టేషన్ సుమారు 8 కిలో మీటర్లు ఉంటుంది. ఏటీఎం మిషన్‌ను ధ్వంసం చేయడానికి దొంగలకు కనీసం అరగంటైనా పట్టి ఉంటుందని, బ్యాంకు మేనేజర్ సమాచారం ఇచ్చిన వెంటనే సకాలంలో పోలీసులు, హైవే పెట్రోలింగ్ పోలీసులు గానీ వెళ్లి ఉంటే చోరీ జరిగేది కాదని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

దొంగలు కారులో..

ఏటీఎం వద్దకు దొంగలు వాగనర్ కారులో గ్యాస్ కట్టర్‌లతో వచ్చినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మంగళవా రం రాత్రి డిచ్‌పల్లిలో వాగనర్‌కారు ఎత్తుకెళ్లినట్లు కేసు నమోదైందన్నారు. ఎవరికైనా కారు ఆచూకీ లభిస్తే 100 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

గతేడాది బుస్సాపూర్‌లో..

గతేడాది జూలైలో మెండోరా మండలం బుస్సాపూర్ గ్రామంలో జాతీయ రహదారి 44 పక్కనే గల తెలంగాణ గ్రామీణ బ్యాంకులో గుర్తు తెలియని దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్యాస్ కట్టర్‌లతోనే లాకర్లను ధ్వంసం చేసి నగదు, 8 కిలోల బంగారం ఎత్తుకెళ్లారు. ఆ కేసు ఇప్పటికీ పూర్తి స్థాయిలో కొలిక్కిరాలేదు. ప్రస్తుతం అదే మాదిరి జాతీయ రహదారి పక్కనే గల ఎస్‌బీఐ ఏటీఎంలో చోరీ జరిగింది. గ్యాస్ కట్టర్‌తోనే ధ్వంసం చేసి దొంగలు చోరీకి పాల్పడ్డారు. గతంలో ఏటీఎంలో చోరీకి పాల్పడిన యూపీకి చెందిన గ్యాంగులో కొందరు పోలీసులకు చిక్కారు.

కాంగ్రెస్ తుది దశ కసరత్తు

- టిక్కెట్ల కేటాయింపు కోసం చివరి సర్వేలు
- ప్రత్యర్థులుగా ఎవరొస్తారు.. బలాబలాలపై విశ్లేషణ
- విడతలవారీగా క్షేత్రస్థాయికి వెళ్లిన బృందాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : రానున్న శాసనసభ ఎన్నికల్లో కచ్చితంగా గెలవాలనే లక్ష్యంతో వ్యూహరచన చేస్తున్న కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థుల కేటాయింపు కోసం తుది దశ కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా చివరి సర్వేలు చేయిస్తోంది. వివిధ దశల్లో వేరువేరుగా బృందాలతో క్షేత్రస్థాయి సర్వేలు చేయిస్తోంది. ఇప్పటికే అధికార పార్టీ బీఆర్‌ఎస్ జిల్లాలో సిట్టింగులకే మరోసారి టిక్కెట్లు ఖరారు చేసింది. ఈ నేపథ్యంలో టిక్కెట్లు కేటాయించే విషయంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల బలంతో పాటు ప్రత్యర్థుల బలాబలాలను సైతం బేరీజు వేసేలా సర్వేలు చేయిస్తోంది. ఈ క్రమంలో టిక్కెట్ల కోసం ప్రయత్నాలు చేస్తున్న ఆశావహులు ఒకవైపు క్షేత్రస్థాయిలో తిరుగుతూనే గాంధీభవన్, ఢిల్లీ పెద్దల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. జిల్లాలో బాల్కొండ, బోధన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే అభ్యర్థుల ఖరారు విషయంలో అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గాల విషయంలో మాత్రం తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది. ప్రతి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీసీలకు రెండు టిక్కెట్లు కేటాయించాలనే నిబంధన పెట్టుకున్న నేపథ్యంలో ఆ దిశగానూ కసరత్తు చేస్తున్నారు. కోరుట్ల, నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ శాసనసభ సెగ్మెంట్లలో ఏవైనా రెండు బీసీలకు కేటాయించాలనే డిమాండ్ ఉంది. అయితే నిజామాబాద్ అర్బన్ టిక్కెట్టు కోసం టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్, మాజీ మేయర్ ధర్మపురి సంజయ్ పోటీ పడుతున్నారు. మైనారిటీ కోటా నుంచి టీపీసీసీ ఉపాధ్యక్షుడు తాహెర్‌బిన్ హందాన్ ఆశిస్తున్నారు. ఆర్మూర్ టిక్కెట్టు కోసం పొద్దుటూరి వినయ్‌రెడ్డి పోటీ పడుతుండగా, మున్నూరుకాపు బీసీ కోటా నుంచి గోర్త రాజేందర్ గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు. గోర్త రాజేందర్ ఢిల్లీ స్థాయిలో భారీగానే లాబీయింగ్ చేస్తున్నారు. అయితే కోరుట్ల టిక్కెట్టు ఓసీ సామాజిక వర్గానికి కేటాయిస్తే ఆర్మూర్ బీసీలకు, లేదా కోరుట్ల బీసీలకు కేటాయిస్తే ఆర్మూర్ టిక్కెట్టు ఓసీలకు కేటాయించాలని పీసీసీలో బీసీ వర్గం నాయకులు పట్టుబడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఉత్కంఠ నెలకొంది. నిజామాబాద్ అర్బన్, ఆర్మూర్ టికెట్లను బీసీలకు కేటాయించాల్సి వస్తే ఒక టిక్కెట్టు మున్నూరుకాపు, మరో టిక్కెట్టు గౌడ్‌లకు కేటాయించాలని డిమాండ్లు ఉన్నాయి. మరోవైపు పార్టీ నాయకత్వం తుది దశ సర్వేలు చేయిస్తుండడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికల కోడ్ మరో పదిరోజుల్లో రానుండడంతో పార్టీ నాయకత్వం అన్ని టిక్కెట్లను ఒకేసారి ప్రకటించాలనే ఆలోచనతో ఉన్నట్లు నాయకులు చెబుతున్నారు.

ఈ–కేవైసీ కోసం పరుగులు

- తప్పనిసరికాకున్నా తిప్పలు పడుతున్న లబ్ధిదారులు
- డిసెంబర్ వరకు గడువుందంటున్న అధికారులు



నగరంలోని ఓ బ్యాంకువద్ద కార్డుదారుల బారులు

నిజామాబాద్ రూరల్ : ఈకేవైసీ చేయించకుంటే రేషన్ బంద్ అవుతుందనే పుకార్ల కారణంగా లబ్ధిదారులు ఈకేవైసీ, మీ సేవాకేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. హాస్టళ్లలో ఉన్న పిల్లలకు, గల్ఫ్‌దేశాల్లో ఉన్న తమవారికి రేషన్‌కోటా నిలిచిపోతుందని ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ రేషన్‌కార్డులు అందుతాయని జిల్లాలో ఎన్నో కుటుంబాలు ఎదురుచూస్తున్నప్పటికీ నిరాశే ఎదురవుతున్నది. నూతన రేషన్‌కార్డులు జారీ చేయకపోగా.. రేషన్‌కార్డులు కలిగిఉన్న వారు ఈ కేవైసీ చేయించాలని కొత్త నిబంధన ఏమిటని లబ్ధిదారులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికీ కొత్తరేషన్‌కార్డుల కోసం అప్లై చేసుకునేందుకు పోర్టల్ ఓపెన్‌కావడం లేదు. ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణిలో లక్షకుపైగా రేషన్‌కార్డు దరఖాస్తులు అందినట్లు సమాచారం.

నాటి నుంచి నేటి వరకు కార్డులు లేవు..

2006లో ఫొటోతో జారీ అయిన రేషన్ కార్డులు టీపీఎల్ సెంటర్లలో కొనసాగాయి. ఆ తరువాత ఉమ్మడి రాష్ట్రంలో రేషన్ కార్డుల ఊసే లేకుండా పోయింది.

కేవలం పేరుతో కూడిన రేషన్ కార్డులు మాత్రమే జారీ చేసింది. జిల్లాలో 4,02,462 రేషన్ కార్డులు ఉండగా, అందులో 12,87,234 మంది ఉన్నారు. 2010 నుంచి 2014 వరకు ఫొటో లేకుండా ఫుడ్ సెక్యూరిటీ కార్డులు జారీ కాగా, అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ప్రజలకు వర్తించాయి. అప్పటినుంచి ఇప్పటివరకు నూతన రేషన్‌కార్డులను ప్రభుత్వం జారీ చేయకపోగా, మార్పులకు సైతం అవకాశం ఇవ్వలేదు.

ఆందోళన చెందొద్దు

ఈకేవైసీ చేయించకుంటే రేషన్‌రాదనే అపోహను నమ్మొద్దు. డిసెంబర్ నెలాఖరు వరకు ఈకేవైసీ చేయించుకోవచ్చు. ముఖ్యంగా రేషన్‌డీలర్లు ఈకేవైసీ చేయాలి. రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌కార్డు కలిగి ఉన్న వారిని ఈ కేవైసీ చేయించుకోమని చెప్పింది కానీ, దానికి కటాఫ్ తేదీని ప్రకటించలేదు.

– చంద్రప్రకాశ్, డీఎస్‌వో, నిజామాబాద్

కార్డులేక ఇబ్బందులు

రేషన్ కార్డు కోసం చాలాసార్లు మీ సేవాకేంద్రంలో దరఖాస్తు చేసుకున్నా. కార్డులేక ఇబ్బందులు పడుతున్నా. ప్రభుత్వపథకాలు అందడం లేదు. ఇప్పటికైనా రేషన్‌కార్డులను ప్రభుత్వం మంజూరు చేయాలి.

– ప్రవీణ్‌కుమార్, బైక్‌మెకానిక్, నిజామాబాద్

ఓటరు తుదిజాబితా పక్కాగా ఉండాలి

- జాబితా పరిశీలకులు క్రిస్టీనా జెడ్ చోంగ్తూ
- కలెక్టర్‌తో కలిసి పోలింగ్ కేంద్రాల సందర్శన



అర్సపల్లిలో వివరాలు తెలుసుకుంటున్న క్రిస్టీనా

సుభాష్‌నగర్/బాల్కొండ/జక్రాన్‌పల్లి: అర్హులందరూ ఓటు హక్కు కలిగి ఉండేలా ఓటరు తుదిజాబితాను పక్కాగా రూపొందించాలని ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టీనా జెడ్ చోంగ్తూ సూచించారు. నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలోని జక్రాన్‌పల్లి మండలం పడకల్, అర్బన్ పరిధిలోని అర్సపల్లి, ఆర్మూర్ పరిధిలోని మాక్లూర్ మండలం గుత్ప, బాల్కొండ పరిధిలోని పోచంపాడ్, బోధన్ పరిధిలోని శక్కర్‌నగర్ ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి క్రిస్టీనా బుధవారం సందర్శించారు. ఓటరు జాబితాలో పేర్ల నమోదు, మార్పులు, చేర్పులను కోరుతూ అందిన దరఖాస్తులను, రిజిస్టర్లలో వివరాల నమోదును పరిశీలించి బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. జాబితాలో ఫొటోలు లేనివారి నుంచి ఫొటోలు సేకరించి అప్‌లోడ్ చేయాలన్నారు. తుది జాబితా రూపకల్పనకు సంబంధించిన నియమ, నిబంధ నలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, పొరపాట్లకు తావివ్వొద్దన్నారు. ఆమెవెంట అదనపు కలెక్టర్ చిత్రామిశ్రా, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, ఆర్డీవోలు రాజేంద్రకుమార్, రాజాగౌడ్, వినోద్‌కుమార్ తదితరులున్నారు.



పోచంపాడ్‌లో ఓటరు నమోదును పరిశీలిస్తున్న క్రిస్టీనా జెడ్ చోంగ్తూ, కలెక్టర్

క్లుప్తంగా

డీఎస్ కృషితోనే నగరాభివృద్ధి



ఖలీల్‌వాడి: డీఎస్ కృషితోనే నగరాభివృద్ధి సాధ్యమైందని మున్నూరు కాపు సంఘాల ప్రతినిధులు అన్నారు. నగరంలోని ప్రగతినగర్‌లో ఉన్న మున్నూరుకాపు సంఘంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ పీసీసీ అధ్యక్షుడు డి.శ్రీనివాస్ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. నగరంలోని మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన 16 సంఘాల ప్రతినిధులు కేక్‌కట్ చేశారు. నగరంలో మంచి నీటి కోసం ఫ్లోరైడ్ రహిత నీటిని డీఎస్ అందించారని, నగరంలో ఆయన చేపట్టిన అభివృద్ధిని ప్రజలు మరిచిపోరని అన్నారు. కార్యక్రమంలో ధర్మపురి సురేందర్, ధామర్తి గంగాధర్, మాజీ మేయర్ సంజయ్, శరత్‌కుమార్, ఆకుల రమేశ్, గాండ్ల లింగం, బంటు అంజయ్య, పసుల రాజ్‌కుమార్, జగదీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

నిధి ఆప్కే నికట్ శిబిరానికి స్పందన



డిచ్‌పల్లి: కేంద్ర ప్రభుత్వం, ఈపీఎఫ్ సౌజన్యంతో డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్‌లో నిధి ఆప్కే నికట్ 2.0 కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి నిజామాబాద్ పీఎఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి సీహెచ్ శ్రవణ్‌కుమార్ హాజరై శిబిరానికి హాజరైన వారి సమస్యలను పరిష్కరించారు. ప్రతి నెల 27న జిల్లాలో నిర్వహిస్తున్న నిధి ఆప్కే నిఖత్ శిబిరాన్ని యజమానులు, పీఎఫ్ చందాదారులు, పింఛనుదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో పింఛనుదారులు, చందాదారులు పాల్గొన్నారు.

ప్రపంచ పసుపు సదస్సులో జిల్లా రైతులు



జక్రాన్‌పల్లి: ముంబైలోని వెస్టిన్ పోవై లేక్ కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం ప్రపంచ పసుపు రైతుల సదస్సు జరిగింది. ఈ సదస్సులో జిల్లా నుంచి పసుపు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధులు పాట్కురి తిరుపతిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, సాయిరెడ్డి, రాజు పాల్గొన్నారు. పసుపు పంట ఎగుమతులు, దిగుమతులు, దళారి వ్యవస్థ, కుర్కుమిన్ శాతం అధికంగా తీయడం వంటి పలు అంశాలపై సదస్సులో పలువురు చర్చించినట్లు రైతు ప్రతినిధి తిరుపతిరెడ్డి పేర్కొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



నిజామాబాద్‌నాగారం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని డీఐజీ సత్యనారాయణ అన్నారు. నగరంలోని నాగారం మైనార్టీ గురుకుల పాఠశాలలో మూడు రోజులు నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా క్రీడా పోటీలు బుధవారం ముగిశాయి. కార్యక్రమానికి డీఐజీ హాజరై మాట్లాడారు. విద్యార్థులతో చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అనంతరం విజేతలకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ఆర్‌ఎల్‌సీ ఎండీ బషీర్, హెచ్‌ఎం కిరణ్‌గౌడ్, స్పోర్ట్స్ జిల్లా కో–ఆర్డినేటర్ కొమ్ము కోటేశ్వర్, విజిలెన్స్ అధికారులు ఎండీ జియాహద్, హమీదొద్దీన్, ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్..



శంకర్, వర్నిచౌరస్తా



శ్రీశివశక్తి యూత్ గణేశ్ మండలి, అంబేడ్కర్ కాలనీ



అక్షోప, ఘను (పోచమ్మగల్లీ)



చంద్రశేఖర్, వైశాలి (పోచమ్మగల్లీ)



శరత్ ఫ్రెండ్స్ యూత్, చౌట్‌పల్లి



హ్యాపీ లైన్స్ యూత్, వెల్మల్



మోక్ష, నందిపేట



శివపుత్ర గణేశ్ మండలి, సిరికొండ



ఆరెపు గంగాధర్, దుబ్బాక



కె.గంగారాం, కుమ్మన్‌పల్లి



శ్రీసూర్య రెసిడెన్సీ గణేశ్ మండలి, గంగాస్థాన్ ఫేజ్-2



నంది యూత్, నందిపేట



శ్రీనివాస్, నూత్‌పల్లి



పి.అఖిల, రాణా టవర్స్, నిజామాబాద్



హర్షిత, దీక్షిక (ప్రగతినగర్)



పవన్‌కుమార్, స్వరూప (నిజామాబాద్)

రుణమాఫీకి దేశంలోనే ప్రత్యేక గుర్తింపు

సుభాష్‌నగర్: రుణమాఫీ పథకం దేశంలోనే ప్రత్యేక రైతు పథకంగా గుర్తింపు పొందిందని ఐడీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా చైర్మన్ సంబారి మోహన్ అన్నారు. నగరంలోని ఐడీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన 54వ మహాజన సభ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. సమావేశంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు నిర్వహించిన రెండేళ్ల ఆడిట్ రిపోర్టులకు సభ్యులు ఆమోదం తెలిపారు. అనంతరం సొసైటీ చైర్మన్ల సందేహాలను నివృత్తి చేశారు. పాలకవర్గం ఏర్పడిన సమయంలో ఉమ్మడి జిల్లాలో కేవలం 15 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఉండేవని, ప్రస్తుతం వీటి సంఖ్యను 55కు పెంచి నష్టాల్లో ఉన్న సంఘాన్ని లాభాల బాటలోకి తీసుకొచ్చామని అన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఎన్‌డీసీసీబీ డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, శరత్, చంద్రశేఖర్‌రెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్లు సాయన్న, తారాచంద్ నాయక్, శ్రీనివాస్ గౌడ్, కపిల్‌రెడ్డి, రాజేశ్వర్, రాజాగౌడ్, గోపాల్, డీఏఓ వాజిద్ హుస్సేన్, బిజినెస్ మేనేజర్ నగేశ్, సిబ్బంది, సొసైటీ చైర్మన్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఐడీసీఎంఎస్ చైర్మన్ మోహన్

రైతులు సుస్థిర ఆదాయం సాధించాలి

బోధన్: రైతులు సుస్థిర ఆదాయం సాధించేలా ఎఫ్‌పీవోలు కృషి చేయాలని నాబార్డు జిల్లా అధికారి ప్రవీణ్ కుమార్ సూచించారు. నాబార్డు సహకారంతో నాబార్డు కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో పని చేస్తున్న ఏకచక్రపుర కిసాన్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ బోధన్ శాఖ సర్వసభ్య సమావేశాన్ని బుధవారం సాలూరలో నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. అనంతరం నాబ్కాన్స్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి థామస్ మోడీ మాట్లాడుతూ.. రైతుల ఆదాయం పెరగాలంటే పంట ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించుకోవాలని సూచించారు. సమావేశంలో కోరమాండల్ జోన్‌మేనేజర్ మనోజ్, ఏడీఏ సంతోష్, బీఆర్‌ఎస్ నాయకుడు బుద్దె రాజేశ్వర్, ఎంపీటీసీ సవితా సంజీవ్, ఎఫ్‌పీవో చైర్మన్ పుష్ప, సభ్యులు ఉన్నారు.



మాట్లాడుతున్న నాబార్డు జిల్లా అధికారి ప్రవీణ్ కుమార్

దళిత యువతికి మద్దతుగా ర్యాలీ



జక్రాన్‌పల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు

జక్రాన్‌పల్లి: మండల కేంద్రంలో దళిత యువతిపై దాడికి నిరసనగా స్థానిక మహిళలు బుధవారం పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. యువతిపై దాడికి పాల్పడిన వ్యక్తిని ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేపట్టి ఉరి శిక్ష విధించాలని డిమాండ్ చేశారు. లేకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి బాధితురాలికి న్యాయం చేయాలన్నారు. జాతీయ రహదారిపై రాస్తారోకో చేసేందుకు వెళ్తున్న వీరిని పోలీసులు అడ్డుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

నియామకం..

వేల్పూర్: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా కార్యదర్శిగా వేల్పూర్‌కు చెందిన లింగేశ్వర్ నియమితులయ్యారు. ఈమేరకు బుధవారం నగరంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓబీసీ జిల్లా అధ్యక్షుడు రాజానరేందర్‌గౌడ్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. నాయకులు మోహన్, నరేశ్, నవీన్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు

డొంకేశ్వర్(ఆర్మూర్): నందిపేట్ మండలం కుద్వాన్‌పూర్ ఫీల్డ్ అసిస్టెంట్‌పై వేటు పడింది. పనిదినాలు తక్కువ కల్పించినందు సందీప్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి చందర్ నాయక్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కూలీలకు పనిదినాలు తక్కువ కాకుండా ఎక్కువ రోజులు పని కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లకు డీఆర్‌డీవో సూచించారు.

తెయూ సమాచారం

అక్టోబర్ 4వరకు బీపెడ్ పరీక్ష ఫీజు గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని బీపెడ్ రెగ్యులర్ 2వ, 4వ సెమిస్టర్ థియరీ పరీక్షలకు సంబంధించి అక్టోబర్ 4వరకు ఫీజు చెల్లించవచ్చని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ బుధవారం తెలిపారు. రూ. వంద అపరాధ రుసుముతో అక్టోబర్ 5 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. అనుబంధ కళాశాలల ప్రధానాచార్యులు సంబంధిత దరఖాస్తులను అక్టోబర్ 7వరకు తెయూ పరీక్షల విభాగంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్ www. telanganauniversity. ac. in ను సందర్శించాలని సూచించారు.

5 నుంచి తెయూ ప్రీపీహెచ్‌డీ పరీక్షలు

తెయూ(డిచ్‌పల్లి): తెయూలో వివిధ సబ్జెక్టుల్లో ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు అక్టోబర్ 5 నుంచి ప్రారంభమవుతాయని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. అక్టోబర్ 5న అన్ని సబ్జెక్టులలో రీసెర్చ్ మెథడాలజీ, 6న సంబంధిత ఎంచుకున్న సబ్జెక్టు, 7న రీసెర్చ్ పబ్లికేషన్ ఎథిక్స్ పరీక్షలు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఉంటాయన్నారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

అక్టోబర్ 7వరకు బీఈడీ సెమిస్టర్ పరీక్ష ఫీజు గడువు

తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలోని బీఈడీ రెగ్యులర్ 2వ సెమిస్టర్ థియరీ పరీక్షలకు సంబంధించి అక్టోబర్ 7 వరకు ఫీజు చెల్లించవచ్చని కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు. రూ. వంద అపరాధ రుసుముతో అక్టోబర్ 10 వరకు ఫీజు చెల్లించే అవకాశం ఉందన్నారు. అనుబంధ బీఈడీ కళాశాలల ప్రధానాచార్యులు దరఖాస్తు ఫారాలను అక్టోబర్ 11న తెయూ పరీక్షల విభాగంలో అందజేయాలని తెలిపారు. పూర్తి వివరాలకు తెయూ వెబ్‌సైట్ www. telanganauniversity.ac.in ను సందర్శించాలని సూచించారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



తెయూ(డిచ్‌పల్లి): తెయూ పరిధిలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ నిరసన కార్యక్రమంలో భాగంగా బుధవారం క్యాంపస్ నుంచి మండల కేంద్రం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమన్న, జిల్లా కార్యదర్శి శివ, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడు సురేశ్, కార్యదర్శి బికోజీ, రామకృష్ణ, నరేశ్, దిగంబర్, సతీశ్, సుధీర్, ప్రేమ్‌కుమార్, తిరుపతి, గంగాధర్, రాము, నవీన్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

నిజామాబాద్‌నాగారం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్విమ్మింగ్ విభాగంలో జిల్లా స్థాయి ఎంపికలు నిర్వహించారు. బుధవారం జిల్లా క్రీడల కార్యదర్శి సంగీత్‌రావు ఆధ్వర్యంలో అండర్–14, 17 బాలబాలికలకు పోటీలు నిర్వహించి రాష్ట్ర స్థాయికి ఎంపిక చేశారు. ఎంపికైన వారిలో శ్రీఅఖిల్‌చారి, గంగాఅశోక్‌గౌడ్, సిద్ధార్థగౌడ్, సాయి రోషన్, అక్షాక, మేఘన, ఆర్యన్, తనీశ్, జుమార్రై, అన్‌మోర్, తేజస్, సార్వశ్, నుకేశ్‌గౌడ్, సాంబారీరాజ్, అక్షయ్‌దీప్, కార్తికేయ, లక్ష్మీప్రియ, హైదవశ్రీ, కీర్తన ఉన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కోచ్ మహిపాల్‌రెడ్డి, పీఈటీలు కృష్ణమూర్తి, రాజేశ్వర్, గంగామోహన్ పాల్గొన్నారు.



పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో నిర్వాహకులు

నెట్‌బాల్ పోటీలకు..

డిచ్‌పల్లి: జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం సుద్దులం ఉన్నత పాఠశాలలో సబ్ జూనియర్స్ నెట్‌బాల్ బాలుర, బాలికల జట్ల ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్ సబ్‌జూనియర్ పోటీలకు జిల్లా నుంచి అండర్–16 బాలుర, బాలికల జట్లను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం కె.రాజేశ్వర్, సర్పంచ్ చెవిటి వెంకటేశ్, ఉప సర్పంచ్ రాంరెడ్డి, ఎంఎంసీ చైర్మన్ భూమేశ్, వీడీసీ సభ్యులు, నెట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి గంగాధర్, ప్రధాన కార్యదర్శి రమేశ్, సంయుక్త కార్యదర్శి సునీల్, రమేశ్‌గౌడ్, నాగరాజు, అనిల్, క్రీడాకారులు పాల్గొన్నారు.



ఎంపికైన క్రీడాకారులతో అసోసియేషన్ సభ్యులు

డబ్బుల కోసమే హత్యాయత్నం

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- పీడీఎస్ దందాపై ఉక్కుపాదం మోపుతాం
- సీపీ సత్యనారాయణ



మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా సిరికొండలో ఈ నెల 21న జరిగిన కత్తిపోట్ల ఘటనలో ఇద్దరిని అరెస్టు చేసినట్లు సీపీ సత్యనారాయణ తెలిపారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. సిరికొండకు చెందిన మహ్మద్ అన్సార్, జిల్లా కేంద్రానికి చెందిన రెహమాన్‌లు 2018 నుంచి 2022 వరకు పీడీఎస్ బియ్యం దందా చేసేవారని తెలిపారు. దందాలో రెహమాన్ రూ.18 లక్షలు అన్సార్‌కు ఇవ్వాల్సి ఉంది. అన్సార్, స్నేహితుడు ఇస్రార్, జునైద్‌ల ద్వారా హైదరాబాద్‌కు చెందిన రౌడీషీటర్ అసద్‌తో మాట్లాడి రెహమాన్ నుంచి డబ్బులు ఇప్పించాలని సిరికొండకు రప్పించారు. దీంతో అసద్ తన స్నేహితులు ఆసిఫ్, అయాజ్‌ఖాన్, అల్లుడు అద్నాన్ తమ్ముడు అబ్దుల్లాతో కలిసి ఇన్నోవా కారులో ఈ నెల 21న వచ్చారు. అన్సార్ స్నేహితులు ఇస్రార్, మహేందర్, జునైద్ అక్బర్, దీపక్, జుబైర్, అసద్ టీంతో కలిసి మండల శివారులోని ఎంఎస్ ఫంక్షన్ హాల్‌లో దావత్ చేసుకున్నారు. అర్ధరాత్రి నిందితుడు అసద్ రెహమాన్‌తో డబ్బుల విషయం మాట్లాడుదామని అన్సార్‌కు తెలుపగా అందుకు అన్సార్ ఒప్పుకోలేదు. పొద్దున సెటిల్‌మెంట్ చేసుకుందామని చెప్పడంతో తాను దావత్‌కు రాలేదని కోపంతో మద్యం మత్తులో అసద్ కత్తితో అన్సార్‌పై ఆసిఫ్‌తో కలిసి దాడి చేశాడు. దీంతో ఛాతి, భుజంపై గాయాలయ్యాయి. అడ్డుగా వచ్చిన మహేందర్, జునైద్‌కు సైతం గాయాలయ్యాయి. దీంతో అక్కడి నుంచి నిందితులు కారులో పారిపోయారు. అన్సార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్ సమీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు డీసీపీ జయరామ్, ఏసీపీ కిరణ్‌కుమార్, ధర్పల్లి సీఐ సైదా, ఎస్సై రమేశ్, కానిస్టేబుళ్లు ఉన్నారు.

సాక్షులను బెదిరించిన నిందితుడి అరెస్ట్

ఖలీల్‌వాడి: మూడు నెలల క్రితం జరిగిన ఆరిఫ్ డాన్ హత్య కేసులో ప్రధాన నిందితుడైన షేక్ సమదుద్దీన్‌ను అరెస్ట్ చేసినట్లు సీపీ సత్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరిఫ్‌డాన్ హత్య కేసులో షేక్ సమదుద్దీన్‌ను అరెస్ట్ చేయగా కొన్ని రోజుల క్రితం జైలు నుంచి విడుదల కాగా ఈ కేసులోని సాక్షులను భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు మహమ్మద్ ఐజక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. షేక్ సమదుద్దీన్‌పై రెండో పీఎస్‌లో 12, మూడో పీఎస్‌లో 8, నాలుగో పీఎస్‌లో 14, ఆరో పీఎస్‌లో 5 కేసులు, బోధన్‌లో ఒక మర్డర్ కేసు నమోదైనట్లు తెలిపారు.

చోరీ కేసులో ఒకరు..

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని సిర్‌పూర్‌లో సర్పంచ్ సామ ముత్యంరెడ్డి ఇంట్లో ఈనెల 23న జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఎల్ రాము తెలిపారు. పీఎస్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎస్సై మాట్లాడుతూ.. ఇంట్లో బంగారం చోరీ జరిగిందన్న సర్పంచ్ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టగా గ్రామంలో ఫాగింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్న బోధన్ మండలం ఊట్‌పల్లికి చెందిన వినోద్‌పై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. విచారణలో దొంగతనం చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. అనంతరం సిబ్బందిని ఎస్సై అభినందించారు.



మాట్లాడుతున్న ఎస్సై రాము

క్రైం కార్నర్

చెరువులోపడి ఒకరి మృతి



మృతి చెందిన రవి (ఫైల్)

బోధన్‌టౌన్(బోధన్): బెల్లాల్ గ్రామానికి చెందిన రవి(45) స్థానిక చెరువులోపడి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపారు. రవి రోజు కూలి పని చేస్తు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. చెరువులో తామెర పూలు తీసుకొస్తానని మంగళవారం ఇంటి నుంచి వెళ్లిన రవి తిరిగి రాలేదు. బుధవారం ఉదయం చెరువులో మృతదేహం కనిపించడంతో స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని రవి మృతదేహంగా గుర్తించారు. రవి మృతిపై భార్య, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి భార్య బుజ్జిబాయి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో యువకుడు..

రామారెడ్డి (ఎల్లారెడ్డి): గుండెపోటుతో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని రెడ్డిపేటలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొండ నరేశ్ (28)కు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. నరేశ్‌కు గతంలోనూ గుండెపోటు వచ్చిందని గ్రామంలో గణేశ్ నిమజ్జనం సందర్భంగా డీజే శబ్దానికి మరోసారి గుండెపోటు వచ్చినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. నరేశ్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

స్వగ్రామానికి చేరిన మృతదేహం



షాదుల్లా (ఫైల్)

డిచ్‌పల్లి: బతుకుదెరువు నిమిత్తం ఓమన్ దేశానికి వెళ్లిన బర్దీపూర్ గ్రామానికి చెందిన షేక్ షాదుల్లా (45) అనారోగ్య సమస్యతో ఈ నెల 17న మృతి చెందాడు. దీంతో ఆయన మృతదేహం స్వగ్రామానికి బుధవారం చేరుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 8న గల్ఫ్‌లోని ఒమన్ దేశానికి వెళ్లిన షాదుల్లా 15న బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురికాగా 17న మృతి చెందినట్లు తెలిపారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ నీరడి సుజన, గ్రామస్తులు కోరారు.

బైక్ కొనివ్వలేదని యువకుడి ఆత్మహత్య



మహేశ్(ఫైల్)

ఎల్లారెడ్డి: బైక్ కొనివ్వలేదనే మనస్తాపంతో ఓ యువకుడు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డిలో బుధవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీకి చెందిన కోర్ల మహేశ్ (18) తల్లిదండ్రులు బైక్ కొనివ్వడం లేదనే మనస్తాపంతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహితను కాపాడిన యువకుడు

నందిపేట: మండల కేంద్రంలోని తాళ్ల చెరువులో పడి మునిగిపోతున్న ఓ వివాహితను గ్రామానికి చెందిన యువకుడు నాగుల సుధాకర్ కాపాడాడు. ఎస్సై రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుందం అంజలి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై బుధవారం సాయంత్రం చెరువులోకి దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. నీటిలో మునుగుతున్న ఆమెను చూసిన చుట్టు పక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై రాహుల్, కానిస్టేబుల్ లింగం ఘటన స్థలానికి చేరుకొని స్థానికుడు సుధాకర్ సహాయంతో బయటకు తీసుకొచ్చి ఆసుపత్రికి తరలించారు. మహిళ ఆరోగ్యం నిలకడగా ఉంది.